మానవ హక్కుల కమిషన్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ విజయభారతి

కుషాయిగూడ: మానవ హక్కుల కమిషన్‌తో సత్వర న్యాయం పొందవచ్చని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ విజయభారతి అన్నారు. శనివారం ఆమె కుషాయిగూడలోని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల కమిషన్ పనితీరు, ఉపయోగాలు, తదితర అంశాలపై న్యాయవాదులకు అవగాహన కల్పించారు. సామాన్య ప్రజలకు మానవ హక్కుల కమిషన్ పనితీరుపై న్యాయవాదులు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆమెను ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. అమరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మోహన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ అందజేత

మౌలాలి : వినాయక్‌నగర్ డివిజన్ దీన్‌దయాల్‌నగర్ కాలనీకి చెందిన లావణ్య అనారోగ్యం కారణంగా సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా.. వైద్య ఖర్చుల నిమిత్తం శనివారం మంజూరైన రూ.27,500ల చెక్కును ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి బోయిన్‌పల్లి క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బద్దం పరశురాంరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సురేష్, తులసి, డివిజన్ కార్యదర్శి బాలకృష్ణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి

వర్షం వస్తే గోదారి.. లేదంటే నరక దారి

- గుంతలమయంగా ఉప్పల్ రహదారి
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు


నల్లచెరువుకు వెళ్లే వరంగల్ జాతీయ రహదారి ఇలా..

ఉప్పల్: ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి పనులు పెండింగ్‌లో ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఉప్పల్ వరంగల్ రహదారి విస్తరణకు దశాబ్దకాలం పడితే, ఆ రహదారిని సరిచేసేందుకు అంతకంటే ఎక్కువ సమయం పడుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూసేకరణ పూర్తై దాదాపు ఆరేళ్లు గడుస్తున్నా.. నేటికి అధికారులు రోడ్లకు మరమ్మతులు చేయలేకపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్లను విస్తరించినా ఫలితం లేకుండా పోయింది.

మట్టి కుప్పలు.. కంకరతేలి..

రోడ్లపై మట్టి కుప్పలు, కంకర తేలిన రోడ్డుతో వాహనదారులు నిత్యం ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారు. దశాబ్ద కాలం నుంచి ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారి అభివృద్ధికి నోచుకోక స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులకు అనేకసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు.

- ఉప్పల్ నుంచి నారాపల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ 2021లో ప్రారంభించారు. దాదాపుగా రూ. 670 కోట్ల అంచనా వ్యయంతో రంగంలోకి దిగిన అధికారులు నిర్మాణ పనులను సాగదీస్తున్నారు. ఉప్పల్ నుంచి నారాపల్లి వరకు దాదాపు 6.4 కిలోమీటర్ల విస్తరణతో రాష్ట్రంలో రెండో పొడవైన వంతెనగా రూపుదిద్దుకోనుంది.
- నిర్మాణ పనులు చేపట్టిన గాయత్రి కన్‌స్ట్రక్షన్స్ చేతులు ఎత్తివేయడంతో ఈ మధ్యకాలంలోనే కాంట్రాక్టును అధికారులు రద్దు చేసి మరో కాంట్రాక్టర్ కోసం వెతుకుతున్నట్టు సమాచారం. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులకు ఏకైక ఎజెండా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తి చేయిస్తామని వాగ్దానాలు చేశారని ప్రజలు చెబుతున్నారు. కారిడార్ పనుల కంటే ముందు కనీసం రోడ్లయినా వేయాలని స్థానికులు కోరుతున్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


సైకిల్ పెట్రోలింగ్‌తో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అల్వాల్: నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పెట్రోలింగ్ టీమ్, ఉమెన్స్ స్టాఫ్ ఆధ్వర్యంలో శనివారం డిఫెన్స్ కాలనీలో సైకిల్ పెట్రోలింగ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక యువకులు, విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. నేటి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

నాలాల్లో వ్యర్థాలను తొలగించండి

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని జ్యోతినగర్, మిర్జాల్‌గూడ తదితర ప్రాంతాల్లో ఓపెన్ నాలాల్లో పేరుకుపోయిన షిల్ట్‌తో పాటు వ్యర్థాల కారణంగా నాలాల్లో వరదనీటికి ఆటంకం కలుగుతుందన్నారు. ఏళ్ల తరబడి షిల్ట్ ఉన్నప్పటికీ పూడికతీత చేపట్టడం లేదని వాపోయారు. ఈ విషయంపై సంబంధిత సర్కిల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి పేరుకుపోయిన షిల్ట్‌ను తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


జ్యోతినగర్ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు ఇలా..

ఘట్‌కేసర్–శామీర్‌పేట లింక్ రోడ్డును కుదించాలి

కీసర: ఘట్‌కేసర్–శామీర్‌పేట లింక్ రోడ్డును 200 అడుగుల నుంచి 100 అడుగులకు కుదించాలని కీసర మండలానికి చెందిన పలువురు నాయకులు కోరారు. ఈ మేరకు వినతిపత్రాలను హెచ్‌ఎండీఏ కమిషనర్, జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డిలకు సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సభ్యుడు సింగిరెడ్డివెంకట్‌రెడ్డి, తటాకం నారాయణ, మంచాల కిరణ్ జ్యోతి ప్రవీణ్, జూపల్లి వెంకటేష్, పండుగ కవిత శశికాంత్, కందాడి ప్రమీల మాట్లాడుతూ... ఘట్‌కేసర్–శామీర్‌పేట 200 అడుగుల రహదారికి దగ్గర నుంచే ఓఆర్‌ఆర్ రహదారి నిర్మితమైందని, గతంలో ఓఆర్‌ఆర్ లేని సమయంలో ఈ రహదారిని 200 అడుగుల విస్తరించాలని మాస్టర్‌ప్లాన్‌లో పొందుపర్చడం జరిగిందన్నారు. ఓఆర్‌ఆర్ రహదారి ఏర్పాటైన తరువాత ఈ రహదారిలో వాహనాల రాకపోకలు తగ్గాయన్నారు. లింక్‌రోడ్డు 200 అడుగులగా ఉండటంతో ఈ రహదారిగుండా వ్యవసాయ భూములు ఉన్న చిన్న సన్న కారు రైతులు తమ పిల్లల చదువులు, వివాహాల కోసం విక్రయించుకుందామంటే ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ రహదారిలో కొండాపూర్, భోగారం, కీసర, తిమ్మాయిపల్లి, తదితర గ్రామాల్లో ప్రధాన రహదారి గుండా 100 అడుగులలోపే పేదలకు చెందిన ఇండ్లు ఉన్నాయన్నారు. ఈ రహదారిని 200 అడుగుల మేర విస్తరిస్తే పేద రైతులు, నిరు పేదలు తమ ఇండ్లు, పొలాలను పోగొట్టుకోవాల్సి ఉంటుందన్నారు. సన్న చిన్నకారుల రైతులు, పేదలను దృష్టిలో ఉంచుకొని లింక్ రోడ్డును 100 అడుగులు మాత్రమే విస్తరించాలని, ఈ మేరకు మాస్టర్ ప్లాన్ లోనూ మార్పులు చేపట్టాలన్నారు.

స్థానిక సమస్యలపై జెడ్‌సీకి వినతి



వినతిపత్రం అందజేసిన కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: స్థానిక సమస్యలు, అభివృద్ధి పనులపై మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ శనివారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిశారు. ఈ సందర్భంగా డివిజన్ సమస్యలు, అభివృద్ధి పనులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాజీవ్‌పార్కు అభివృద్ధి, బండబావి వద్ద మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. దీనికి జెడ్సీ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

పార్కులను అభివృద్ధి చేయాలి

కుషాయిగూడ: పార్కులను ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఆమె అధికారులతో సమావేశమయ్యారు. ఆయా కాలనీ సంక్షేమ సంఘాలతో మమేకమై పార్కులను అభివృద్ధి చేయాలని, వనమహోత్సవం పార్కుల్లో నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్ వ్యాప్తంగా ఉన్న పార్కుల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాలన్నారు. హార్టికల్చర్ అధికారులు లోకేష్, నరేష్ పాల్గొన్నారు.


అధికారులతో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

ప్రత్యేక పూజలు


శాకంబరిగా అన్నపూర్ణాదేవి

మల్కాజిగిరి: మల్కాజిగిరి మారుతీనగర్‌లోని అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి శాకంబరీ దేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించినట్లు అర్చకులు లక్ష్మణశర్మ తెలిపారు.

బ్రాహ్మణ విద్యార్థులకు స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

మేడిపల్లి: బ్రాహ్మణ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వివేకానంద విద్యాపథకం కింద నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే నిధులను విడుదల చేయాలని ఎండోమెంట్ సెల్ ధార్మిక పరిషత్ మెంబర్ పాలకుర్తి శేషగిరిరావు ప్రభుత్వానికి ఓ ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

గౌతంనగర్: గురుపౌర్ణమి సందర్భంగా మల్లికార్జుననగర్ మల్లన్న దేవాలయంలో నేడు శ్రీ త్రిమూర్తి స్వరూప గురు దత్తాత్రేయస్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ప్రకటించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పేకాట స్థావరంపై ఎస్‌వోటీ పోలీసుల దాడి

జవహర్‌నగర్: గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న స్థావరంపై ఎస్‌వోటీ పోలీసులు దాడి చేసిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌వోటీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దమ్మాయిగూడ సాయిప్రియ కాలనీలోని ఓ నివాసంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌వోటీ పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 1,50,575, రెండు కార్లు, 11 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అయితే అందులో మాజీ వార్డు మెంబర్, ప్రస్తుత కౌన్సిలర్ భర్త పాండల యాదగిరితో పాటు మరో 10 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి చాక్లెట్ల విక్రేత అరెస్ట్

పోచారం: గంజాయితో పాటు గంజాయి చాకెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ జూపల్లి రవి సమాచారం మేరకు... పీర్జాదిగూడలో బీహార్‌కు చెందిన బబ్లూ కుమార్ (53) కిరాణా షాపు నిర్వహిస్తూనే గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు ఘట్‌కేసర్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు షాపును తనిఖీ చేశారు. దుకాణంలో 253 గ్రాముల గంజాయి, 390 గ్రాముల గంజాయి చాక్లెట్లు దొరికాయి. దీంతో దుకాణాన్ని సీజ్ చేసి గంజాయి చాక్లెట్లు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితున్ని రిమాండ్‌కు తరలించారు.

మద్యం బాటిళ్ల ధ్వంసం

శామీర్‌పేట్: శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో గడచిన ఏడాదిగా పట్టుబడిన మద్యం బాటిళ్లను శనివారం పోలీస్ స్టేషన్‌లో అధికారులు ధ్వంసం చేశారు. శామీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ సమాచారం మేరకు పోలీస్‌స్టేషన్‌లో 63 కేసులు నమోదు కాగా.. 690 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ ఎక్సైజ్ అడిషనల్ సూపరింటెండెంట్ మాధవయ్య పర్యవేక్షించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కాప్రా: భారీవర్షాల కారణంగా వాతావరణశాఖ రెడ్, ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్పా.. బయటకు రాకూడదని సూచించారు. చిన్న పిల్లలను ఇంటి నుంచి బయటకు రాకుండా చూడాలని కోరారు. భారీ వర్షాలతో నాలాలు, డ్రైనేజీలు పొంగిపొర్లే పరిస్థితి ఉందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ.. ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ.. సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు కాలనీల ప్రజల కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.


ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


విద్యార్థులతో లెఫ్టినెంట్ కల్నల్ వికాస్‌వర్మ

మల్లాపూర్: విద్యార్థులు చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని లెఫ్టినెంట్ కల్నల్ వికాస్‌వర్మ అన్నారు. శనివారం నాచారం డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో 'ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లెఫ్టినెంట్ కల్నల్ వికాస్ వర్మ హాజరై హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్‌కి బ్యాడ్జీలను అందజేసి ప్రమాణం చేయించారు. ప్రోగామ్ కో– ఆర్డినేటర్ రీసెర్చ్ సెంటర్ ఇమారత్, పాఠశాల చైర్మన్ నవనీతరావు మేనేజింగ్ డైరెక్టర్ నవీన్‌కుమార్, కోర్ హెడ్ ఆపరేషన్స్ కిషోర్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుమమీనన్, వైస్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన


భవానీనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం లోతట్టు ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి భవానీనగర్, న్యూ భవానీనగర్ కాలనీల్లో పర్యటించారు. వరదనీరు నిల్వ ఉండకుండా చూడాలని, మ్యాన్‌హోల్స్‌ను తెరిచేవారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసరమైతే తప్పా.. బయటికి రావొద్దని సూచించారు. కాప్రా సర్కిల్ ఈఈ హరిలాల్, డీఈ రూప, ఏఈ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్ వార్డు కార్యాలయానికి సీఎం చిత్రపటం


కార్పొరేటర్‌తో స్థానిక కాంగ్రెస్ నేతలు

మల్లాపూర్: మల్లాపూర్ వార్డు కార్యాలయానికి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డికి అందజేశారు. అనంతరం కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని వార్డు కార్యాలయాల్లో సీఎం ఫోటోను ఉంచాలన్నారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు విక్టరీ జోషీ, శేఖర్‌గౌడ్, భాస్కర్, శేఖర్ తదితరులున్నారు.

మేడ్చల్‌లో భారీ వర్షం



మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో శనివారం భారీగా వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు ముసురుతో పాటు అప్పుడప్పుడు వర్షం జోరుగా కురిసింది. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి శనివారం కురిసిన వానే అతిపెద్ద వాన. ఉదయం నుంచి ప్రారంభమై ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో ఎక్కడ చూసినా నీరే కనిపించింది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. కాలనీలలో పల్లపు ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో వరద నీరు నిలిచింది. పొద్దంతా ముసురుతో జనజీవనానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. చెరువులకు, కుంటలకు నీరు చేరాయి.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

ఉప్పల్ : ఉప్పల్ మిని శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కనకదుర్గ డాన్స్ అకాడమీ గురువు డా. ఏలేశ్వరపు చలపతిశాస్త్రి కుమార్తె శర్వాని ఆధ్వర్యంలో నృత్య నీరాజనం గురుపౌర్ణిమ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇష్టదేవత ప్రార్థన, గణేషా పంచరత్న, జతిస్వరం, లక్ష్మీకామాక్షి స్తుతి వెంకట్ దీక్షితులు, గురుస్తుతి శారదలు ప్రదర్శించి అలరించారు. వయోలిన్ విద్వాంసులు సాయికుమార్ కళాకారులను ఈ సందర్భంగా అభినందించారు.


శిల్పారామంలో నృత్య సోయగం

డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి

ఉప్పల్ : చిలుకానగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ఎల్‌బీనగర్ జెడ్సీ హేమంత్ కేశవ్‌పాటిల్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. బీరప్పగడ్డ ప్రాంతంలో సీసీరోడ్డు ఏర్పాటు, చిలుకానగర్ గుట్టపై ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పార్కులో చిన్నపిల్లలు ఆడుకోవడానికి ఆటవస్తువులను ఏర్పాటు చేయాలని విన్నవించారు. దీనికి జెడ్సీ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ వివరించారు.



జెడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్

'పరిశుభ్రమైన సమాజాన్ని నిర్మిద్దాం'


అయోధ్యనగర్ కాలనీలో పనులను పరిశీలిస్తున్న మేయర్ జక్క వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: వ్యాధి రహిత సమాజ నిర్మాణం కోసం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'సఫాయి అప్నావో, బిమారీ భగావో' కార్యక్రమాన్ని మేయర్ జక్క వెంకట్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. స్వచ్ఛభారత్ మిషన్ (ఎస్‌బీఎం)ఫేజ్–2లో భాగంగా వర్షాకాలంలో మెరుగైన పారిశుద్ధ్యం, పరిశుభ్రత, వ్యర్థాల సేకరణ కమ్యూనిటీ పబ్లిక్ టాయిలెట్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని గుర్తు చేశారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ప్రభావిత ప్రాంతాలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాలాలతో పాటు చెరువుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని అధికారులకు సూచించారు. ఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ మురళి, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, రమణారెడ్డి, కైసర్, వెంకన్న, అనిల్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

థియేటర్‌లో తనిఖీలు

సౌకర్యాలు కల్పించాలని సూచన

అల్వాల్: జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు అల్వాల్ సర్కిల్ లోతుకుంటలోని లక్ష్మీకళామందిర్ థియేటర్‌లో శనివారం డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని, పార్కింగ్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఫుడ్‌స్టాల్స్, ఫైర్ సెఫ్టీ, బిల్డింగ్ పర్మిషన్, ప్రాపర్టీ ట్యాక్స్, ఫిర్యాదు బాక్స్ ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించారు. ఏసీపీ సాంబయ్య, ఏఎంసీ నర్సింహారెడ్డి, సూపరింటెండెంట్ స్వామి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్, టీపీవో రాజేందర్‌గౌడ్, ఎస్ఎస్. ప్రభాకర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


తనిఖీలు చేస్తున్న డీసీ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

గురుపౌర్ణమి ఉత్సవాలు

గౌతంనగర్ : సాయినగర్ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం ఉదయం నుంచి బాబావారి మేలుకొలుపు, కాగడహారతి, మంగళాభిషేకం, ప్రత్యేక పూజలతో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు, 10 నుంచి 11 వరకు భక్తులచే సహస్ర నామర్చనలు జరిగాయి. రాత్రి బండాది సౌజన్య బృందంచే రాగసుధ మ్యూజికల్ అకాడమీ ద్వారా భక్తి సంగీత కార్యక్రమం ఆకట్టుకుంది.

నిషేధిత హెరాయిన్ తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

మేడిపల్లి: నిషేధిత హెరాయిన్‌ను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. రాజస్థాన్‌కు చెందిన దినేష్‌కుమార్ బిష్ణోయ్ (27)బోడుప్పల్ గాయత్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. గత కొంతకాలం నుంచి రాజస్థాన్‌లో హెరాయిన్‌ను కొనుగోలు చేసి నగరంలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. శనివారం బోడుప్పల్‌లో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు దినేష్ అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకుని విచారించగా.. సుమారు రూ.లక్ష విలువైన 10 గ్రాముల హెరాయిన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.


దినేష్‌కుమార్

'అమ్మమాట.. అంగన్‌వాడీ బాట'

మల్లాపూర్: అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు చక్కటి విద్య, పౌష్టిక ఆహారం అందిస్తున్నట్లు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మారావు అన్నారు. శనివారం మల్లాపూర్ అంగన్‌వాడీ స్కూల్లో 'అమ్మబాట– అంగన్‌వాడీ బాట'లో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు వాణి, స్వరూప, దేవకరుణ, రాణి, మమత, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం..

నాచారం డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ హాజరయ్యారు. మేడ్చల్ వెల్ఫేర్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, అల్వాల్ సీడీపీఓ స్వాతి, సూపర్‌వైజర్ వెంకటరమణ, స్కూల్ టీచర్లు స్వాతి, మాధవి, రమ శశికళ తదితరులు పాల్గొన్నారు.


సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్